

ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలి : ఎంఎల్‌ఎ

తణుకు: ఆర్‌టిసి సంస్థ అందిస్తున్న మరిన్ని మెరుగైన సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. శనివారం ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా కార్గో పార్శిల్-కార్గో రవాణా కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొని మాట్లాడారు. 50 కిలోల వరకు బరువున్న వస్తువులను డోర్ డెలివరీ చేసే సేవలను ఆర్‌టిసి సంస్థ చేపట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 80 ప్రధాన నగరాలలో డోర్ డెలివరీ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. తణుకు ఎపిఎస్‌ఆర్‌టిసి కార్గో పార్శిల్ దారాపు 6 వేల డోర్ డెలివరీలు చేయడం విశేషమని, సహకరిస్తున్న అధికారులను అభినందించారు. మాసోత్సవాల్లో భాగంగా ప్రతి వారం లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయివేటు సంస్థలతో పోల్చితే ఆర్‌టిసి సంస్థ ఇస్తున్న ధరలు తక్కువగా ఉన్నాయని, సమయాన్ని సైతం ఆదా చేసుకునే విధంగా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్, ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ, ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పోలవరం' జిల్లాపై

మొండిగా ముందుకు..!

- ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోని పరిస్థితి
- పోలవరం జిల్లాలో 'పోలవరం' కలపాలన్న వినతులు బుట్టదాఖలు
- కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ఊసే కరువు
- అభ్యంతరాలపై సిఎం సమీక్ష పూర్తి
- 31న తుది నోఫికేషన్‌కు రంగం సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం జిల్లా ఏర్పాటులో ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్నట్లు కన్పిస్తోంది. పోలవరం నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో కలపాలని నెల రోజులుగా ప్రజలు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని పరిస్థితి నెలకొంది. ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగానే పోలవరం నియోజకవర్గం లేకుండా రంపచోడవరం జిల్లా కేంద్రంగా చింతూరు డివిజన్‌తో కలిపి పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 27న జిల్లాలకు సంబంధించిన మార్పులు, కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. నెల రోజులపాటు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించింది. ప్రజల అభ్యంతరాలపై శనివారం సిఎం చంద్రబాబు మంత్రులతో కలిసి సమీక్షించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని జిల్లాలోని ఏజెన్సీ ప్రజలంతా గట్టిగా కోరుతూ నెల రోజులుగా అనేక ఆందోళనలు సైతం నిర్వహించారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సైతం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు బాధిత నిర్వాసితులు అత్యధికంగా పోలవరం నియోజకవర్గంలోని కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కొయ్యలగూడెం మండలాల్లో ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తున్నప్పుడు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలను కలపాలని ఇక్కడి ప్రజలంతా కోరుతూ వచ్చారు. ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌లో తమకు అనకూలంగా నిర్ణయం తీసుకుంటుందని గిరిజనులంతా ఎంతగానో ఎదురుచూశారు. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. పోలవరం లేని పోలవరం జిల్లాను ఏర్పాటు చేసేందుకు పూనుకుంది. ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని గంగలో కలిపేసినట్లయ్యింది. ప్రభుత్వ తీరును పోలవరం నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు. అభ్యంతరాలపై చర్చలు ముగియడంతో ఈ నెల 31న జిల్లాల మార్పులు, చేర్పులకు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదల చేయనుంది. దీంతో పోలవరం నియోజవకర్గ ప్రజల ఆశలు కలలుగానే మిగిలిపోనున్నాయి.



పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలని ఏజెన్సీ బంద్ సందర్భంగా బుట్టాయగూడెంలో మానవహారం (ఫైల్‌ఫొటో)

పట్టని కైకలూరు, నూజివీడు నియోజకవర్గ ప్రజల గోడు

తాము అధికారంలోకి వస్తే నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని సిఎం చంద్రబాబు ఎన్నికల సభలో హామీ ఇచ్చారు. దీంతో అక్కడి ప్రజలు తమ కోరిక నెరవేరుతుందని ఆశించారు. కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని రాజకీయ నాయకులు, ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తం కావడంతోపాటు వినతులు సైతం ఇచ్చారు. జిల్లాల మార్పులు, చేర్పులు ప్రాథమిక నోటిఫికేషన్‌లో కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రస్తావన లేకుండాపోయింది. దీంతో నెల రోజులుగా ఈ రెండు నియోజకవర్గాల్లో పెద్దఎత్తున నిరసనలు, దీక్షలు సాగుతున్నాయి. అధికారులకు పెద్దఎత్తున వినతులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అభ్యంతరాలపై చర్చల్లోనూ కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ఊసే లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలోనే ఉండనున్నాయి. జిల్లాల మార్పులు, చేర్పులపై ప్రజల అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగడంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మరోసారి పునరాలోచించి కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని జనం కోరుతున్నారు.

హాలో కార్మికా.. చలో విశాఖ

- సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోరుతూ జోరుగా ప్రచారం
- చింతలపూడిలో ఆకట్టుకున్న 18 మీటర్ల జెండాతో ప్రదర్శన
- భీమవరంలో మోటారు సైకిల్ ర్యాలీని ప్రారంభించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపిమూర్తి
- తణుకులో కరపత్రాలు ఆవిష్కరించిన మాజీ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆకట్టుకుంది. తమ మహాసభ సంబరాలను అంబరాన్నంటించేలా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మోటార్ సైకిల్ ర్యాలీని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి ప్రారంభించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, బొంబాయి స్వీట్ సెంటర్, గాంధీచౌక్ జువ్వలపాలెం రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్, మావుళ్లమ్మ గుడి వీధి మీదగా తిరిగి సిఐటియు కార్యాలయం వద్దకు చేరింది. ర్యాలీలో మెడికల్ రిప్‌లు, మున్సిపల్, రైస్‌మిల్లు, బజారు జట్టు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు, ఒపిఎస్ అమలయ్యే వరకు పోరాడాలని ఉద్యోగ, కార్మికులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌ల అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సూర్యచంద్రరావు, కె.వెంకటేశ్వరావు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.



భీమవరంలో...



వీరవాసరంలో...

ఇరగవరం : సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో తలపెట్టిన మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నేత కామన మునిస్వామి, మండల కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.వేణుగోపాల్‌రావు, ఎం.సత్యవతి, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం : జనవరి 4న విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానికంగా బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో బొర్రా అలమహారాజు, బాలం విజయకుమార్, యండమూరి సుబ్బారావు, కొత్తల సత్తిబాబు, బొక్కా కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరంలో...

తణుకు : కార్మికుల పక్షాన నికరంగా పోరాడే సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. శనివారం పట్టణంలో సిఐటియు అఖిల భారత మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ 1970 నుండి సిఐటియు కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్పొరేట్లకు మేలు చేయడానికి కార్మికులను హింసించడం అన్యాయమన్నారు. పోరాటం ద్వారా సాధించుకున్న హక్కులను హరిస్తే, మళ్లీ పోరాటాల ద్వారా సాధించుకోవడం కార్మికులకు తెలుసని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : సిఐటియు అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయాలని, జనవరి 4న విశాఖలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నగరంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమైంది. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించిన 55 ఏళ్ల అనంతరం సిఐటియు జాతీయ మహాసభ తొలిసారి మన రాష్ట్రంలో జరుగుతుందన్నారు. లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల హక్కులు పూర్తిగా కాల రాస్తున్నారని, కార్పొరేట్లకు పెద్దపీట వేసి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ హోల్‌సేల్‌గా అమ్మేస్తున్నారని, సహజ వనరులు అన్నింటినీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. వీటన్నింటిపై మహాసభలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. జనవరి 4వ తేదీ ఆదివారం లక్ష మంది కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ విశాఖ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఏలూరు జిల్లా నుండి వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మంచెల్ల ఇస్సాక్, జి.గోపి, పంపన రవికుమార్, వివిఎన్.ప్రసాద్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, అంగనవాడీ యూనియన్ నేతలు హైమావతి, గేదెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : సిఐటియు 18వ ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో 18 మీటర్ల జెండాతో ప్రదర్శన నిర్వహించారు. ఎర్రచీరలు, ఎర్ర చొక్కాలతో చేపట్టిన ర్యాలీని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వియస్.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం మాట్లాడారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకు సాగింది. ర్యాలీ అగ్రభాగానే తీన్మార్ డప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ నత్తా వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.పుణ్యవతి మాట్లాడగా నేతలు ఎస్.సరోజిని, జి.సరళాదేవి, కె.కవిత, శ్యామల, అరుణ, చెన్నకేశ్వరి, హేమలత, పాపరత్నం, బి.సరళ, అశ్విని, పుష్పరాణి, వరలక్ష్మి, వంశీ, పద్మ, కృష్ణవేణి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : సిఐటియు మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు కోరారు. శనివారం పూళ్లలో జనవరి 4న బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను అంగన్వాడీలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు చల్ల మణి, అపర్ణదేవి, స్వర్ణకుమారి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో..

నిడమర్రు : సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నిడమర్రు, భువనపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కానూరు రాజు, నేతలు టి.వెంకటలక్ష్మి, కె.జయమ్మ, ఎ.నాగమణి, ఎస్.ధనలక్ష్మి, అనురాధ, త్రివేణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సిఐటియు జాతీయ మహాసభ నేపథ్యంలో స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడగా, కార్యక్రమంలో పి.లక్ష్మి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, షేక్ మస్తాన్, బి.పద్మ, ముత్యాలు, ఎం.చంద్ర తదితరులు పాల్గొన్నారు.




ఏలూరులో...

సిఐటియు మహాసభకు మెడికల్ రిప్స్ విరాళం

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం కావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ భీమవరం బ్రాంచ్ కమిటీ సిఐటియు జిల్లా కమిటీకి రూ.50 వేలు విరాళాన్ని అందించింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావుకు ఎపిఎంఎస్‌ఆర్‌యు నేతలు చెక్కు అందించారు. ఈ సందర్భంగా వారిని వాసుదేవరావు అభినందించారు. కార్యక్రమంలో ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్రరాజు భీమవరం బ్రాంచి నాయకులు బాలకృష్ణ, రమేష్, పి.రవి పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మెడికల్ రిప్స్ యూనియన్ నేతలు

31న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

నూతన సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వచ్చే జనవరి ఒకటో తేదీన పంపిణీ చేయాల్సిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒకరోజు ముందుగానే ఈ నెల 31న పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఈ నెల 30న అవసరమైన నగదు ఉపసంహరణకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పింఛన్ లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా సమయానికి పంపిణీ జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రుల పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంత్రి ఉదయం 11 గంటలకు పిఎం లంకలోని డిజిటల్ బిల్డింగ్‌కు చేరుకుని 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం సియెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎస్‌ఆర్‌లో భాగంగా చేపట్టిన డ్రోన్లు, కృత్రిమ మేధస్సు (ఎఐ) నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, 'వికసిత్ భారత్ అండ్ డిజిటల్ ఇండియా' థీమ్‌పై రూపొందించిన చిత్రాలను పరిశీలిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గేమ్ హబ్ గేమ్ ఫౌండేషన్, ఎగ్జిమ్ బ్యాంక్‌లతో ఎంఒయూలపై సంతకాల కార్యక్రమం ఉంటుందని చెప్పారు. జీవనోపాధి చెక్కుల పంపిణీ, విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, 'వందేమాతరం' అంశంపై గాన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. డెలాయిట్ ఆధ్వర్యంలో నిర్మించిన గేబియన్ వాల్‌ను కేంద్ర మంత్రి పరిశీలిస్తారన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో కలిసి నరసాపురంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ కూడా పాల్గొంటారు.

మిడ్డే మీల్స్‌ను ప్రయివేటు సంస్థలకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - గణపవరం

మిడ్డే మీల్స్ పథకాన్ని ప్రయివేటు సంస్థలకు ఇవ్వవద్దని కోరుతూ శనివారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన మిడ్డేమీల్స్ కార్మికులు ఎంఇఒకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు మండల కన్వీనర్ ఎం.పెంటారావు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు మాట్లాడుతూ 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు ఎన్ని ఇబ్బందులు వచ్చినా విద్యార్థులకు భోజనాలు వండి అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లు ఇవ్వకపోయినా, సొంత సొమ్ములతో పిల్లలకు వండి పెడుతున్నా.. అధికారులు, ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించకుండా చూడటం దారుణమన్నారు. పథకాన్ని ప్రయివేటు వ్యక్తులకు ఇస్తే మిడ్డేమీల్స్ కార్మికులు చూస్తూ ఊరుకోరన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు. సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం అవుతామన్నారు. అనంతరం స్థానిక ఎంఇఒ జి.బాలయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న మిడ్డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన ఎంఇఒకు వినతి



వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు, నాయకులు

జిల్లాలో పలు రోడ్లకు మహర్దశ

18 రోడ్లు అభివృద్ధికి రూ.41.33 కోట్ల నిధులు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 83.690 కిలో మీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.4,133 లక్షలు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వీటిలో రెండు రాష్ట్ర రహదారులు 12.580 కిలోమీటర్ల పరిధిలో రూ.900 లక్షలు, జిల్లాలోని 16 ప్రధాన రహదారులు 71.110 కిలోమీటర్ల పరిధిలో రూ.3,233 లక్షలు రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. భీమవరం-ఎల్‌విఎన్ పురం వయా కొమరాడ, అనా కోడేరు రోడ్డు అభివృద్ధికి రూ.448 లక్షలు, కొల్లేరు నుంచి భీమవరం, గొల్లలకోడేరు నుంచి నౌడూరు రోడ్ల అభివృద్ధికి రూ.485 లక్షలు, మొగల్తూరు నుంచి బేతపూడి వయా వెంప రోడ్ల అభివృద్ధికి రూ.280 లక్షలు, యలమంచిలి నుంచి సరిగాలపల్లి, పాలకొల్లు నుంచి కాజా, పిడి రోడ్డు నుంచి గణపవరం రోడ్ల అభివృద్ధికి రూ.370 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మంచిలి నుంచి కోరుకొల్లు రోడ్ల అభివృద్ధికి రూ.380 లక్షలు, కొలమూరు నుంచి కొండేపాడు, కవిటంపాకల నుంచి మాలవానితిప్ప రోడ్ల అభివృద్ధికి రూ.270 లక్షలు, కొమ్ముచిక్కాల నుంచి మడుగు పోలవరం, కాజా నుంచి కలగంపూడి రోడ్ల అభివృద్ధికి రూ.300 లక్షలు మంజూరయ్యాయన్నారు. మార్టేరు నుంచి వడలి రోడ్ల అభివృద్ధికి రూ.20 లక్షలు, సిజి రోడ్డు నుంచి కోనాల రోడ్డు వయా కాగుపాడు, జలపాలెం, దర్శిపర్రు మీదుగా రోడ్ల అభివృద్ధికి రూ.30 లక్షలు, మాధవరం నుంచి కంసాలిపాలెం రోడ్ల అభివృద్ధికి రూ.70 లక్షలు, ఎన్ఎ రోడ్డు నుంచి బోడపాడు రోడ్డు అభివృద్ధికి రూ.150 లక్షలు, అత్తిలి అలంపురం రోడ్డు అభివృద్ధికి రూ.40 లక్షలు, నవాబుపాలెం నుంచి దండగర్రు రోడ్డు అభివృద్ధికి రూ.30 లక్షలు, మాముదురు నుంచి ముప్పర్తిపాడు రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఏనుగువానిలంక నుంచి బాడవ వయా మద్యపుంత రోడ్డు అభివృద్ధికి రూ.50 లక్షలు, రాష్ట్ర రహదారులు చేబ్రోలు నుంచి ఉండి రోడ్డు అభివృద్ధికి రూ.500 లక్షలు, భీమవరం నుంచి గుడివాడ రోడ్డు అభివృద్ధికి రూ.400 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

31, 1 తేదీల్లో మద్యం షాపులు త్వరగా మూసేయాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ



వినతిని అందజేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 31, జనవరి 1న మద్యం షాపులు రాత్రి 7 గంటలకే బంద్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. శనివారం నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు, ఎస్ఐ ఖాసీంకు ఐద్వా ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల పేరుతో పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. మద్యం వల్ల రోడ్లపై తిరుగుతున్న మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను అరికట్టాల్సిన ప్రభుత్వం మద్యం షాపులకు అదనపు సమయం కేటాయించడం సరైంది కాదని విమర్శించారు. ప్రభుత్వం టార్గెట్ పెట్టి అమ్మకాలు అందించడం కరెక్ట్ కాదని, అమ్మకాలను నియంత్రించాలన్నారు. తాగి ఎవరైనా బయటికి వస్తే వారిని అరెస్ట్ చేసే విధంగా తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం షాపులు సాయంత్రం 7 గంటలకు మూసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యురాలు బూడిద భువనేశ్వరి పాల్గొన్నారు.

అప్పలరాజుపై పీడీ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, యూనియన్ నేతలు

ప్రజా ఉద్యమ నేత, రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్‌ను రద్దు చేయాలని తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. అప్పలరాజును విడుదల చేయాలని శనివారం స్థానికంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం అనకాపల్లి జిల్లా నేత అప్పలరాజు అనకాపల్లి జిల్లాలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా, అక్కడ భూ బాధితులకు అండగా నిలబడ్డారని తెలిపారు. ధర్మవరం గ్రామం చుట్టుపక్కల అనేక గ్రామాల్లో ప్రజా సమస్యల మీద పనిచేసిన అప్పలరాజుని పీడీ యాక్టు కింద అరెస్టు చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. పీడీ యాక్ట్ భూ కబ్జాదారులకు, డ్రగ్స్ మాఫియా ముఠాలకు, మానవ అక్రమ రవాణా చేసే వారి మీద ప్రయోగించడం రాజ్యాంగ హక్కు అని, కానీ ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తికి ఈచట్టం ఏవిధంగా వర్తిస్తుందని వారు ప్రశ్నించారు. వెంటనే అప్పలరాజు మీద పెట్టిన పీడీ యాక్ట్ రద్దు చేసి, విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, అడప ఆంజనేయులు, మద్దాల పుత్రయ్య, కర్రి శ్రీనివాస్ రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, ఎస్‌విఎస్.రెడ్డి, ఆకుల నారాయణ, అడ్డగర్ల కృష్ణ, గాది వెంకటరావు, బుద్ధాల నాని, గుడిమెట్ల నాగబాబు, సత్తి దుర్గారెడ్డి, తదితర యూనియన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

600 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన దేవాలయం కాళ్లకూరు శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అని చైర్మన్ అడ్డాల శివరామరాజు అన్నారు. కాళ్లకూరు శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా ఆవిష్కరింపచేసిన ప్రతులను శనివారం ఆలయం వద్ద నూతన వెబ్‌సైట్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్, ధర్మకర్త మండలి సభ్యులు నంబిపల్లి వెంకట రామరాజు, ఎం.తిరుమల లక్ష్మీ నరసింహ శ్రీకాంత్, యాతం వెంకట సుబ్బారావు, ఉగ్గిన లక్ష్మణరావు, యర్రింశెట్టి జగన్ మోహన కృష్ణ పాల్గొన్నారు.


పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి చెట్లపల్లి రాము వారి తండ్రి చెట్లపల్లి వెంకట సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం గోద్రెజ్ బీరువాను బహూకరించారు. గతంలో విద్యార్థులకు గొడుగులు, మంచినీటి సీసాలను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లి, చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా విద్యను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాల తరఫున రాముకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవిష్యత్తుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి రాముతో పాటు మిరియాల సూర్య ప్రకాష్, విద్యా కమిటీ చైర్మన్ రాపాక శ్రీను, ఉపాధ్యాయులు సిహెచ్.శ్రీను, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం గుడి లోపల ఏర్పాటు

ప్రజాశక్తి - కాళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

కాళ్లకూరు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం గుడి లోపల ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ అడ్డాల శివరామరాజు, ఇఒ అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. కాళ్లకూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పాలకమండలి సభ్యులు, గ్రామస్తులతో కలిసి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పెద్ద తిరుపతి, చిన్న తిరుపతిలో వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం గుడి లోపల ఉండటం ఆనవాయితీ. దీని ద్వారా కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో అవిధంగా ఉండేలా ఏర్పాటు చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సూచనలు ఇచ్చారని విషయాలను సమావేశంలో దేవస్థానం చైర్మన్ అడ్డాల శివరామరాజు వివరించారు. ఈ సమావేశంలో మార్పు విషయంపై గ్రామస్తులు, పాలక మండలి సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ మార్పుకు గ్రామస్తులు, పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు.

ప్రభాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం

వీరవాసరం: మండల విద్యాశాఖ కార్యాలయంలో మెసెంజర్‌గా పనిచేసిన వట్టిపల్లి ప్రభాకర్ కుటుంబానికి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులందరూ కలిసి రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. వికలాంగుడైన ప్రభాకర్ అకస్మాత్తుగా మృతి చెందారు. తమతో పాటు కార్యాలయంలో పని చేసే ప్రభాకర్ మృతి ఆయన కుటుంబానికి తీరనిలోటని ఉపాధ్యాయులు అన్నారు. తమ వంతు సాయంగా ఈ ఆర్థిక సాయం కుటుంబానికి ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ప్రసాద్ బాబు, డి.పుల్లారావు, కె.నాగముసేశ్వరావు, నక్కిన శ్రీనివాసరావు, జి.పద్మజ, ఎం.ఇంటర్లింజ్ పాల్గొన్నారు.

అభిరామ్ కుటుంబానికి పరామర్శ

నరసాపురం: అభిరామ్ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందడం అత్యంత విషాదకరమని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అభిరామ్ భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కఠిన సమయంలో కుటుంబానికి తాము అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై తీవ్ర సంతాపం తెలియజేస్తూ బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎఎంసి మాజీ చైర్మన్ ఆకస్మిక మృతి



సాంబశివరాజు (ఫైల్)

ఉండి: ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు(62) శనివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు ఆయన మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. సాంబశివరాజు సేవా కార్యక్రమాల్లో ముందుండేవారని కొనియాడారు. పార్టీలకతీతంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

రూ.4.24 కోట్లతో పల్లె పండుగ 2.0

వీరవాసరం: మండలంలో పల్లె పండుగ 2.0తో రూ.4.24 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈమేరకు ఈ పనులన్నింటికీ భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఈ పనులన్నీ ఈనెల 30, జనవరి 3వ తేదీన అంజిబాబు ప్రారంభిస్తారన్నారు. వీరవాసరంలో రూ.66 లక్షలతో నాలుగు పనులు, రాయకుదురులో రూ.12 లక్షలతో, పంజా వేమవరంలో రూ.9.30 లక్షలతో, బొబ్బనపల్లిలో రూ.17 లక్షలతో, ఉత్తరపాలెంలో రూ.18.50 లక్షలతో ప్రారంభిస్తారన్నారు. మత్స్యపురిపాలెంలో రూ.20 లక్షలతో, మెంటేపూడి రూ.8 లక్షలతో ఒక్కొక్క పని, కొణితివాడలో రూ.13.50 లక్షలతో, నవుడూరులో రూ.46 లక్షలతో, తోలేరులో రూ.37 లక్షలతో, మత్స్యపురిలో రూ.65 లక్షలతో, బాలెపల్లిలో రూ.41 లక్షలతో, వడ్డిగూడెంలో రూ.71 లక్షలతో రెండేసి పనులు చేపట్టనున్నారు.

తేతలిలో గొడౌన్ ప్రారంభం

తణుకు: గత వైసిపి పాలనలో వ్యవస్థలను అస్తవ్యస్తం చేసి వెళ్లిపోయారని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. నియోజకవర్గంలో కనీసం రైతుల ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు గొడౌన్ ఏర్పాటు చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధి నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. శనివారం మండలంలోని తేతలి గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సొసైటీ గొడౌన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తణుకు ఎఎంసి చైర్మన్ కొండేటి శివ, సొసైటీ అధ్యక్షులు మల్లి వెంకట్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై అవగాహన

భీమవరం టౌన్: నిర్దేశ వయస్సు రాకుండా వివాహం చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని, బాల్య వివాహాల చట్ట ప్రకారం నేరం, చేసుకున్న వారు, చేయించినవారు, సాక్షులు, అందరూ శిక్షార్హులేనని భీమవరం సీనియర్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జె.సురేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు బాల్య వివాహ నిరోధక చట్టం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు శనివారం కాళ్ల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు న్యాయవాదులు ఎంటి.భవాని, కె.విజయలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్, గ్రామ సర్పంచి బందా విజయ, ఉప సర్పంచి పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బార్ అసోసియేషన్ కార్యదర్శి డి.సూర్య ప్రకాష్ రావు అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బాల్య వివాహాలను నిరోధించాలని కోరుతూ బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. శనివారం నరసాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌హెచ్‌ఒ హెచ్.జె.నరసింహం అధ్యక్షత వహించారు. ఎస్‌ఐ సిహెచ్.జయలక్ష్మి పాల్గొని బాల్యవివాహాల వల్ల జరుగుతున్న పరిణామాలు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పిఎల్‌వి ఎం.విజయకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోడూరు: పోడూరు గ్రామ సచివాలయంలో బాల్య వివాహాల రద్దు చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సెక్రటరీ యోహను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్‌లైన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ అంశంపై 100 రోజుల అవగాహన సదస్సులో భాగంగా ఈ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణ రాజు, పంచాయతీ సెక్రెటరీ ఎం.వెంకట లక్ష్మి, గ్రామ పెద్ద జావ్నాని వీరరాఘవులు, పాల్గొన్నారు.

చిందిన రక్తం.. ఎవరిది వైఫల్యం..!




రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. దేశ భవిష్యత్తుకు చోదకశక్తులైన యువత ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రైతే దేశానికి వెన్నెముక అని గొప్పలు చెప్పుకునే దేశంలో తాము చెమటోడ్చి పండించిన పంటను అధికారులు ధ్వంసం చేస్తుంటే ఇదేమిటని అడిగినందుకు రక్తమొచ్చేటట్లు కొట్టడంతోపాటు బాధితులపైనే కేసులు పెట్టడం మన పాలకులకే చెల్లింది. ఈ రెండు ఘటనలకు మూలం చట్టాల వైఫల్యమా.. లేక పాలకుల వైఫల్యమా.. ఎవరిది వైఫల్యం అనే అంశం రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది.

రెండు జిల్లాల్లో ఈ కాలంలో చోటుచేసుకున్న వరుస రోడ్డు ప్రమాదాల్లో సుమారు పది మందికిపైగా మృత్యువాతపడ్డారు. వీరిలో యువత ఎక్కువగా ఉండటం ఆందోళన కల్గించే అంశం. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుమంట్ర మండలం పొలమూరులో ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందడం అందరినీ కలిచివేసింది. యువకులు మోటారు సైకిల్‌పై బయల్దేరి అర కిలోమీటరు దూరం ప్రయాణించగానే ప్రమాదానికి గురవ్వడంపై అసలు ప్రమాదానికి కారణాలేమిటనే దానిపై కలెక్టర్ నాగరాణి ఒక కమిటీని సైతం నియమించారు. అయితే ఇది రోడ్డు డిజైన్ వరకే పరిశీలించి నివేదిక ఇస్తే ప్రమాదానికి కారణాలు పూర్తిస్థాయిలో వెల్లడయ్యే అవకాశం లేదనే వాదన విన్పిస్తోంది. గ్రామంలో రోడ్డు ఇరుకుగా ఉండటం సమస్యగానే ఉందని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. గ్రామంలో వాహనాల వేగం నియంత్రణకు స్పీడ్‌బ్రేకర్లు లేదా రబ్బింగ్ స్ట్రిప్స్‌గాని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఇక ఇదే గ్రామశివార్లలో కొన్ని నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన యువకుడు గల్ఫ్ నుంచి కుమారుని పుట్టినరోజు వేడుకకు వచ్చి, సొంత పనిపై భీమవరం వెళ్లొస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదాలన్నింటికీ వాహనాల అతివేగమే కారణమని స్పష్టమవుతోంది. దీనిపై కమిటీ ఏం నివేదిక ఇస్తుందో వేచిచూడాలి. అలాగే మద్యం మత్తు కూడా ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. పట్టణాలు ఎలాగున్నా మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు రాత్రి 11 గంటల వరకే తెరిచి ఉంచాల్సినప్పటికీ ప్రధాన షట్టర్లు మూసినా, వెనుక మార్గం నుంచి రాత్రి 12, ఒంటి గంట వరకూ విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో యువత మద్యం సేవించడంతోపాటు ఇష్టంతో కొనుక్కున్న స్పోర్ట్స్ బైక్‌లపై మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వీటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ఇదే క్రమంలో శనివారం తెల్లవారుజామున భీమడోలు మండలం సూరప్పగూడెం ఫ్లయ్ ఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ముగ్గురు యువకులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఫ్లవర్ డెకరేషన్ పని చేసే ముగ్గురు యువకులు తెల్లవారుజామునే ఏలూరు వచ్చి పూలు కొనుగోలు చేసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు అంచనా. కలిదిండి మండలం సున్నంపూడి వద్ద బొలేరో బోల్తా పడి చేపల పట్టుబడికి వెళ్లిన తండ్రీకొడుకులు, మరొకరు మృత్యువాత పడ్డారు. వరుస ప్రమాదాలు రెండు జిల్లాల ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒకపక్క రోడ్లు అధ్వానం వల్ల ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, రోడ్లు బాగున్న కొద్దిపాటి ప్రాంతాల్లో నిబంధనలు పాటించక, మద్యం మత్తు తదితర కారణాల రీత్యా ప్రమాదాలు చోటుచేసుకుని యువత ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలపై రెండు జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించడంతోపాటు క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. లేనిపక్షంలో రోడ్లు రక్త మోడడానికి బాధ్యత పాలకులే వహించాల్సి ఉంటుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

ఇక ఏజెన్సీలోని బుట్టాయగూడెం మండలం ఇనుమూరులో 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూముల్లోకి ప్రొటెక్షన్ ఆర్డర్ పేరిట రెవెన్యూ, పోలీసు అధికారులు వెళ్లి మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడం మనం ప్రజాస్వామిక దేశంలో ఉన్నామా, లేక నియంతృత్వ పాలనలో ఉన్నామా అనే సందేహం కలుగుతోంది. వాస్తవానికి ఈ భూమి ప్రభుత్వ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా ఉంది. మధ్యలో ఆన్‌లైన్‌లో గిరిజనేతర భూస్వామి తన పేరు నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే సదరు భూస్వామి ఎన్నడూ ఆ భూమిలో సాగు చేసింది లేదు. దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసు కూడా ఉంది. ఒకవేళ రైతు ఆర్‌డిఒ నుంచి ప్రొటెక్షన్ ఆర్డర్ పొందితే అదే విషయం గిరిజనులకు సామరస్యంగా తెలియజేయడం, భూమిని తమ స్వాధీనంలోకి తీసుకుంటూ బోర్డు పెట్టడం మైదాన ప్రాంతంలో సర్వసాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే ఏజెన్సీలో మాత్రం గిరిజనేతర భూస్వాముల కాసులకు కక్కుర్తిపడుతున్న అధికారులు వారు చెప్పినట్లే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కజొన్న పంటను ట్రాక్టర్లతో తొక్కిస్తుంటే ఏ రైతుకైనా బాధ కలగక మానదు. ఇదేమిటని ప్రశ్నిస్తే దుర్భాషలాడటం, అడ్డుకునే ప్రయత్నం చేస్తే మహిళలని చూడకుండా మగ పోలీసులచే దాడి చేయించడం, అమాయక గిరిజనులను రక్తమొచ్చేటట్లు కొట్టడం ఇవన్నీ ఎంతవరకూ న్యాయమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. పైగా బాధితులైన గిరిజనులనే నేరస్తులుగా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేయడం వెనుక ఎవరి హస్తం ఉందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఒక యువకుని సర్టిఫికెట్ మంజూరు విషయంలో తాత్సారం చేయడంపై ఇదే తహశీల్దార్ తీరుపై గతంలో ఎంఎల్‌ఎ బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. గిరిజనులన్నా, గిరిజన చట్టాలన్నా చులకనగా చూసే అధికారులను ఏజెన్సీ ప్రాంతానికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికీ ఏం జరిగిందని బాధిత గిరిజనులను గిరిజన ఎంఎల్‌ఎ కనీసం పరామర్శించకపోవడం కూటమి ప్రభుత్వ అండతోనే ఏజెన్సీలో అధికారులు చట్టవిరుద్ధంగా ముందుకెళ్తున్నారని స్పష్టమవుతోంది. అయితే పాలకులు తీరెలా ఉన్నా చట్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిన అధికారులు మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరించడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని పరిశీలకులు సైతం హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కార్యాలయాల్లో కూర్చుని గిరిజనుల సంక్షేమం గురించి సమీక్షలు చేయడం వరకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని, దానికి విరుద్ధంగా ముందుకెళ్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. లేనిపక్షంలో గిరిజనులను రక్తమొచ్చేటట్లు కొట్టడం వెనుక చట్టాల వైఫల్యమా, లేక ప్రభుత్వం, ఉన్నతాధికారుల వైఫల్యమా అనే చర్చ మరింత విస్తృతస్థాయిలో సాగి బాధితులంతా ఉద్యమబాట పట్టే అవకాశం ఉంది.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్




మున్సిపల్ కమిషనర్‌ను సత్కరిస్తున్న హరివిల్లు బృందం

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారధిని హరివిల్లు నాటక అకాడమీ శనివారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఫస్ట్ గ్రేడ్ గా ఉన్న పాలకొల్లు మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్‌గా ప్రొమోషన్ తెచ్చేందుకు ఆయన కృషి చేసినందుకు ఈ సత్కారం లభించింది. వంగా నరసింహారావు సారధ్యంలో సభ్యులు మున్సిపల్ కార్యాలయం కు వచ్చి సత్కారం చేశారు. పట్టణంలో ఇటీవల డ్రెయిన్‌లలో సిల్ట్ తీయడం వల్ల దోమల బెడద తగ్గిందని కళాకారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బోనం మునసబ్, ధనాని సూర్య ప్రకాష్, వర్మ పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టు మిషన్లు ఎంతగానో దోహదపడతాయని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొప్పర్రులో 40 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని నాయకర్ సూచించారు. ప్రతి మహిళ కుట్టులో వృత్తి నైపుణ్యం పెంచుకుంటే మరింత ఉపాధి పొందవచ్చున్నారు. టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు లేసు అల్లికలకు తీర ప్రాంతానికి ఎంతో గుర్తింపు ఉందన్నారు. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు శిక్షణ ఇప్పించడంతో పాటు ఉచితంగా మిషన్లు అందించడం అభినందనీయమన్నారు. జనసేన సీనియర్ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి నల్లి వరలక్ష్మి, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, అందే రామకృష్ణ, పత్తి లక్ష్మి సంపూర్ణ, వలవల నాని, పోలిశెట్టి నళిని, పోలిశెట్టి గణేశ్వరరావు, నేదునూరి సావిత్రి పాల్గొన్నారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపులో మోగల్లు విద్యార్థి సత్తా

ప్రజాశక్తి - పాలకోడేరు

అమలాపురం బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన జోనల్ లెవెల్ ఎవరెస్ట్ బేస్ క్యాంపు సెలక్షన్లో మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి కె.రామకృష్ణ సత్తా చాటాడు. బేస్ క్యాంపుకు సంబంధించి ఎబిలిటీ టెస్టుల్లో ముందంజలో ఉండి సెలెక్ట్ కావడం ఆనందదాయకమని హెచ్‌ఎం త్రినాధులు అభినందించారు. ఇంతటి విజయానికి కారణమైన ఎస్‌ఎ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు ఎస్.ఉమా, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.సూర్యను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం : ఎంఎల్‌ఎ

తణుకు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంఎల్‌ఎ రాధాకృష్ణ అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరైన కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు అన్ని గ్రామాల్లో సుమారు 13 వేల గ్రామసభలు నిర్వహించి, ఒక రికార్డు సృష్టించి ఆయా గ్రామాల్లో ఉన్న అవసరాలు, మౌలిక సదుపాయాలను గుర్తించి, దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక సుస్థిరమైన ప్రభుత్వం ఉండే విధంగా ప్రతి ఒక్కరూ భావించాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఎంఎల్‌ఎ కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలం వల్లూరు పల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. జనసేన మండలాధ్యక్షుడు పుల్ల బాబి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సీసీ రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గత ప్రభుత్వంలో రోడ్డులు లేని, విద్యుత్ దీపాలు లేని దుస్థితిని చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవంతో, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆలోచనలతో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎన్‌ఆర్‌జిఎస్ నిధుల నుండి రూ.12 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అదేవిధంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రూ.14.16 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. ఎంపిపి కట్టుబోయిన వెంకటలక్ష్మి, పసల అచ్యుతం, పేతిన గిరిధర్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పసల కొండ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ లయన్స్ క్లబ్


చైర్‌పర్సన్ కృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ లయన్స్ క్లబ్ అని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ వివి.కృష్ణంరాజు అన్నారు. భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో శుక్రవారం లయన్స్ జిల్లా 316జి రీజనల్-2 రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రీజియన్ చైర్‌పర్సన్ కృష్ణంరాజు, ముఖ్య అతిథులుగా విచ్చేసిన లయన్స్ జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు, మాజీ జిల్లా గవర్నర్ ఎంవిఎస్.రాజు మాట్లాడుతూ సమాజ సేవ, నాయకత్వం, సంక్షేమ కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ అంకితమైందని, లయన్స్ క్లబ్ అనేది ఒక క్లబ్ మాత్రమే కాదని, సమాజ సేవకు అంకితమైన శక్తివంతమైన ఉద్యమన్నారు. నిబద్ధతతో కూడిన నాయకత్వం, సేవాభావం కలిగిన సభ్యులతో ఈ క్లబ్ సమాజానికి గొప్ప మార్పులు తీసుకుని వస్తుందన్నారు. లయన్స్ క్లబ్ భీమవరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్ మాట్లాడారు. అనంతరం క్లబ్ పూర్వాధ్యక్షులు వబిలిశెట్టి కనకరాజు, ఎస్.కృష్ణంరాజు, కెఎస్ఎన్.రాజు, కంతేటి వెంకటరాజు, కాగిత రమణారావు, అల్లు రామకృష్ణ, గమిని రవిచంద్ర, ఆరవ వి.ప్రసాద్, వేగిరాజు విశ్వనాధరాజు, ఎం.రంగనాథం, నందమూరి రాజేష్, నడింపల్లి మహేష్ కుమార్, పేరిచర్ల మూర్తిరాజులను సత్కరించారు. నూతనంగా క్లబ్‌లో జాయిన్ అయిన ముగ్గురికి లయన్స్ పిన్స్‌ను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి కనగర్ల రామకృష్ణ, గోపిశెట్టి మురళీకృష్ణ, డాక్టర్ కొంపెల్ల గోపినాథ్, షేక్ పాదుషా, లయన్స్ సభ్యులు, లయన్స్ ఫెమినా సభ్యులు పాల్గొన్నారు.

బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతి రంగా

సర్పంచి లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు




రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - మొగల్తూరు

బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని కొతపాలెం సర్పంచి లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు(నాని) అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో రాధా, రంగ మిత్రమండలి కోరిక మేరకు సర్పంచి లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన మోహన రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచి దంపతులు మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా పేద ప్రజలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి రంగా అని కొనియాడారు. సమస్యలపై అనేక పోరాటాలు చేసి, ఎంఎల్‌ఎగా విజయం సాధించి ప్రజల గుండెల్లో నిలిచిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి అకన రామ కోటేశ్వరరావు, ఎంపిటిసి విల్లూరి వెంకటేశ్వరరావు, నీటిసంఘ అధ్యక్షులు కత్తుల శ్రీనివాస్, వైసిపి గ్రామ అధ్యక్షులు నిప్పులేటి సుభాష్ చంద్రబోస్, జనసేన గ్రామ అధ్యక్షులు గరగ పెద్దిరాజు, బిజెపి గ్రామ అధ్యక్షులు చెన్ను పెద్దిరాజు, గ్రామ పెద్దలు కొత్తపల్లి రాంబాబు, దొరబాబు, తన్నీడి గిరి, మైలాబత్తుల రాంబాబు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగరాజుకు అభినందన

ప్రజాశక్తి - ఉండి



జుత్తిగ నాగరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జుత్తిగ నాగరాజును ప్రకటించి కూటమి ప్రభుత్వం సమన్యాయం పాటించిందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు అన్నారు. శనివారం మండలంలోని మహదేవపట్నం గ్రామంలో జుత్తిగ నాగరాజును నోబుల్ టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ టిడిపి అనుబంధ సంస్థ అయిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బలోపేతానికి నాగరాజు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేయడమే లక్ష్యంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని పిఎస్ఎన్.రాజు తెలిపారు. అనంతరం జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల లోకానికి చక్కటి విద్యాబోధన నేర్పి వారిని ఉన్నత స్థితికి చేర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి గుబ్బల తేజ దినేష్ కుమార్, కోశాధికారి ఎస్.శ్యాం ప్రసాద్, ఉపాధ్యాయులు ఆర్.దుర్గాప్రసాద్ ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు



శంకుస్థాపన చేస్తున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్, ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. నాబార్డ్ నిధులు రూ.కోటితో నిర్మించనున్న శృంగవృక్షం-పెరిక్కపాలెం రహదారి నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. రహదారులు అత్యంత నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. నూతన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజలకు, ప్రయాణికులకు కొన్ని ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జుత్తిగ నాగరాజు, పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు, సర్పంచి జంగం సూరిబాబు, పాలకోడేరు, శృంగవృక్షం, విసాకోడేరు సొసైటీ చైర్మన్లు కొత్తపల్లి నాగరాజు, కలిదిండి కృష్ణంరాజు, నంబూరి బాలాజీ రాజు, జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీ తులసి, ఎంపిడిఒ రెడ్డియ్య, జనసేన ఎంపిటిసి సత్యకృష్ణ పాల్గొన్నారు.

ఉప కారాగారం తనిఖీ

నరసాపురం: ఉమ్మడి జిల్లాల ప్రధాన జిల్లా న్యాయమూర్తి, చైర్మన్ ఎస్.శ్రీదేవి శనివారం నరసాపురం సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి నిందితుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నరసాపురం పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి, ఇతర న్యాయమూర్తులు జి.గంగరాజు, ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి, ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : స్థానిక ప్రత్యేక ఉప కారాగారాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.శ్రీదేవి సందర్శించి ముద్దాయిలతో మాట్లాడారు. బెయిల్ వచ్చి కూడా జామీన్లు సమర్పించని కారణంగా విడుదల కాని ముద్దాయిల వివరాలు నమోదు చేసుకున్నారు. మహిళా బ్యారక్ ను, ములాఖత్ గదిని పరిశీలించారు. సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) కె.రత్నప్రసాద్, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి, జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి పాల్గొన్నారు.

ఘనంగా వీర్ బాల్ దివాస్

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం, ఎన్ఎస్-ఎస్ యూనిట్ 1, 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల ఆధ్వర్యాన 'వీర్ బాల్ దివాస్'ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ సిక్కుల పదవ గురువు గురునానక్ కుమారుల సాహసం, ధైర్యం, త్యాగం విద్యార్థులందరికీ ఆదర్శనీయంగా ఉండాలని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిబేట్‌ను నిర్వహించారు. విద్యార్థులందరికీ కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ బికెవి.రామలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనలో జెడ్‌పి విద్యార్థులు

పెనుమంట్ర : విజయవాడ(ఫోరంకి)లో జరిగిన రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో పెనుమంట్ర ఆర్ఎ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పి.పావని కళ్యాణి, పి.శ్రీవిద్యలు కలిసి ప్రదర్శించిన పరావలయంతో అద్భుతాలు అనే ప్రాజెక్ట్ జాతీయస్థాయిలో జరిగే రాష్ట్రీయ బాల వైమానిక ప్రదర్శన(ఆర్‌బివిపి)కి ఎంపికైంది. ఈ ప్రాజెక్టు ద్వారా బ్రిడ్జెస్ కట్టడంలో ఉండే మెళకువులను విద్యార్థులు వివరించారు. విద్యార్థులను, వీరికి గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఉపాధ్యాయులను ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, హెచ్‌ఎం సన్మానించారు.